తహసీల్ ఆఫీస్‌కు పునారావాసం కల్పించాలి

రికార్డులు తడవకుండా కప్పిన ప్లాస్టీలు

జైనూర్, జూలై 25 : జైనూర్ తహసీల్ కార్యాలయానికి పునారావాసం కల్పించాలని ఆదివాసీ ఐకాసా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కనక యాదవ రావ్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. భవనం శిథిలావస్థకు చేరగా, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కార్యాలయ స్లాబ్, గోడల నుంచి లోపలికి నీరు చేరి, రికార్డులు తడుస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. కార్యాలయాన్ని వేరే భవనంలోకి మార్చి, రికార్డులను కాపాడాలని, అధికారులు స్పందించాలని కోరారు.

పీఆర్టీయూతోనే సమస్యలు పరిష్కారం

తాండూర్, జూలై 25 : ఉపాధ్యాయ సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించడంలో పీఆర్టీయూటీఎస్ ముందుంటుందని జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టె శంకర్ అన్నారు. తంగళ్లపల్లి, అచ్చలాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల్లో గురువారం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్ సాధించడంతోనే అర్హులైన స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు ఎంఈవో, డీఈవో, జూనియర్ లెక్చరర్, డైట్ లెక్చరర్ వంటి పోస్టులను ఉద్యోగోన్నతి ద్వారా పొందే అవకాశాలున్నాయన్నారు. మండల అధ్యక్ష, కార్యదర్శులు సంబరం శ్రీనివాస్, జీ వెంకటేశ్వర్, రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జన్నారం, జూలై 25 : జిల్లా పీఆర్టీయూ సంఘం ఆదేశాల మేరకు మండలంలోని కిష్టాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలో మండలాధ్యక్షుడు కట్ట రాజమౌళి ఆధ్వర్యంలో సభ్యత్వ నామోదు ప్రారంభించారు. ప్రధాన కార్యదర్శి నగురు సత్యనారాయణ, ప్రవీణ్, పి రాజారావు పాల్గొన్నారు.

రెబ్బెన, జూలై 25 : రెబ్బెన మండలంలోని తుంగెడ, గంగాపూర్, నంబాల పాఠశాలల్లో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాసరావు పీఆర్టీయూటీఎస్ సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాజ్‌కమలాకర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు చునర్కర్ అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి బత్తుల సదానందం, హెచ్ఎంలు అబ్దుల్ లతీఫ్, పురుషోత్తం, వినయ్‌కుమార్, కేజీబీవీ ఎస్‌వో పద్మ, ఉపాధ్యాయులు లింగన్న, రాజేందర్, సంపత్‌కుమార్, సత్తయ్య, శివకుమార్, హిమబిందు, కవిత తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కం కౌన్సెలింగ్ క్లాసెస్

కాగజ్‌నగర్, జూలై 25 : కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంబేద్కర్ ఓపెన్ యునివర్సిటీలో 2023-24 విద్యా సంవత్సరంలో డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీలో అడ్మిషన్ పొందిన ప్రథమ సంవత్సరం సెమిస్టర్-2 విద్యార్థులకు ఈ నెల 28, వచ్చే నెల 4, 10, 11, 18 తేదీల్లో కాంటాక్ట్ కం కౌన్సెలింగ్ క్లాసెస్ నిర్వహించనున్నట్లు స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ దత్తాతేరయ గురువారం ఒక ప్రకటనలోతెలిపారు. విద్యార్థులు తప్పకుండా హాజరవ్వాలని పేర్కొన్నారు. వివరాలకు 98663 98678 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పగిలిన మిషన్ భగీరథ పైప్‌లైన్

వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

హాజీపూర్, జూలై 25 : గుడిపేట పునరావాసా కాలనీ నేషనల్ హైవే రోడ్డు పక్కన మిషన్ బగీరథ పైప్‌లైన్ పగిలి, నీరు వృథాగా పోతున్నది. సంబంధిత అధికారులు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. వారం క్రితం పైపు పగిలింది. పదుల సంఖ్యలో ఫిర్యాదు చేస్తే.. తూతూ మంత్రంగా పనిచేసి, వెళ్లిపోయారు. నాలుగు రోజుల క్రితమే మరమ్మతులు చేసినా.. గురువారం సాయంత్రం పగిలిపోయింది. ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన పంపు హౌస్‌కు కూతవేటు దూరంలో పైప్‌లైన్ పగలడం.., అధికారులు రోజుల తరబడి స్పందించకపోవడంపై వారి వైఫల్యం కొట్టచ్చినట్లు కనిపిస్తున్నదని ప్రజలు ఆరోపిస్తునానరు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

హత్య కేసులో ఒకరి అరెస్ట్

కాసిపేట, జూలై 25 : కాసిపేట మండలంలోని లంబాడీతండా(డీ)లో అజ్మీరా నీల (44) హత్య కేసులో కుడిమేత లంబారావ్‌ను గురువారం అరెస్ట్ చేసినట్లు మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి తెలిపారు. గురువారం దేవాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ ఆంజనేయులతో కలిసి వివరాలను వెల్లడించారు. అజ్మీరా నీల భర్త చనిపోవడంతో 15 ఏళ్లుగా పల్లంగూడకు చెందిన గాండ్ల రవితో సహజీవనం చేస్తున్నది. రవి స్నేహితుడు కోనూర్ గోండుగోడుకు చెందిన అంబారావ్.. నీలపై బలవంతం చేసి, బుధవారం హత్యచేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో గురువారం యాప ఆటో స్టాండ్ వద్ద అంబారావ్ ఉండగా, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. డీసీపీ భాస్కర్ సూచనలతో ఏసీపీ రవికుమార్ ఆధ్వర్యంలో కేసు ఛేధించిన సీఐ శశిధర్, ఎస్ఐ ఆంజనేయులు, దేవాపూర్ పోలీస్ స్టేషన్ సిబ్బందిని రామగుండం సీపీ శ్రీనివాస్ అభినందించారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

సిర్పూర్(టీ), జూలై 25 : మండలకేంద్రంలోని రైతువేదికలో గురువారం డీఆర్డీవో సురేందర్ ఆధ్వర్యంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి పనులపై 13వ విడుత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని 16 జీపీల్లో గతేడాది జరిగిన ఉపాధి పనులపై గ్రామాల వారీగా నివేదికలను తనిఖీలు చేశారు. ఎంపీడీవో సత్యనారాయణ వివరాలు వెల్లడించారు. మొత్తం 386 ఉపాధి పనులు నిర్వహించగా, రూ.2,86,79,045 ఖర్చు చేసినట్లు తెలిపారు. వివిధ పనులకు సంబంధించిన రూ.42,500 జరిమానా విధించగా, రూ 84,400ను రికవరీకి ఆదేశించినట్లు పేర్కొన్నారు. 24 మంది సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయగా, ఒక పనిని ఎంక్వైరీకి, మరో రెండు పనులను క్వాలిటీ కంట్రోల్‌కు బదిలీ చేసినట్లు వివరించారు. జిల్లా విజిలెన్స్ అధికారి అంబుడ్స్‌మన్, ఎంపీడీవో రాజేశ్వర్, ఈజీఎస్ ఏపీవో, ఎంపీవో కృష్ణమూర్తి, కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

డిప్యూటీ డీఎంహెచ్‌వోగా సిద్ధార్థ

సిద్ధార్థకు ఆర్డర్ కాపీ అందజేస్తున్న డీఎంహెచ్‌వో

ఆసిఫాబాద్ టౌన్, జూలై 25 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వోగా సిద్ధార్థకు బాధ్యతలు కేటాయిస్తూ గురువారం డీఎంహెచ్‌వో తుకారాం భట్ ఆర్డర్ కాపీ అందజేశారు. జిల్లాలో ప్రజా ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకొని విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డెమో నాగలక్ష్మి, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, డీఎస్‌వో రమేశ్ చంద్ర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు

శ్రీరాంపూర్, జూలై 25 : శ్రీరాంపూర్ కాలనీ బస్టాండ్ వద్ద గల హోటళ్లు, కిరాణా దుకాణాలు, టీ, ఫుడ్‌స్టాళ్లలో గురువారం మంచిర్యాల జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వాసు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఓ హోటల్‌లో నాణ్యత లేని పిండి, ఆయిల్, టీ స్టాల్‌లో నకిలీ టీ పౌడర్ వాడుతున్నట్లు తేలింది. గోధుమ, శనగ పిండి, వస్తువుల శాంపిల్స్ తీసుకున్నారు. టీ పౌడర్ పడేశారు. అనంతరం ఓ కిరాణా దకాణంలో కాలం చెల్లిని బిస్కెట్ పాకెట్లు లభించాయి. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ పరిశుభ్రత, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. తప్పనిసరిగా హోటళ్ల యజమానులు లైసెన్స్‌లు తీసుకోవాలని, లేకపోతే కేసులు నమోదు చేస్తామన్నారు.

ఆగని వర్షం

కోటపల్లి : నీట మునిగిన పత్తి పంట

చింతలమానేపల్లి : గూడెం వద్ద పంట చేలలోకి చేరుతున్న ప్రాణహిత బ్యాక్ వాటర్

కౌటాల/వాంకిడి/చింతలమానేపల్లి/కోటపల్లి/వేమనపల్లి/పెంచికలపేట్/శ్రీరాంపూర్/సిర్పూర్(టీ)/కెరమెరి, జూలై 25 : వారం రోజులుగా జిల్లాలో వర్షం కురుస్తున్నది. కౌటాల మండలంలోని కుంటలు, చెరువులు, ఒర్రెలు, వాగులు, నదులు నిండుగా మారాయి. మండల కేంద్రంలోని ప్రధానరోడ్డు చిత్తడిగా మారింది. వాంకిడి మండలంలో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో శివారు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గిరిజనులంతా గ్రామాలకే పరిమితమయ్యారు. వాగుల వైపు వెళ్లవద్దని మండల అధికారులు, పోలీసులు హెచ్చరిస్తున్నారు. బంబార జీపీ పరిధిలోని ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి గోండ్‌కోసార, ఇంద్రానగర్, బీకోసార గ్రామలకు వెళ్లే దారి చిత్తడిగా మారింది. చింతలమానేపల్లి మండలంలోని దిందా-శివపెల్లి, నాయికపుగూడ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దిందా-శివపెల్లి గ్రామాలు జలదిబ్బంధంలోనే ఉన్నాయి.

వేమనపల్లి : ఉధృతంగా ప్రాణహిత

దిందా-కేతిని వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. శివపెల్లికి వెళ్లే మార్గ మధ్యలో వాగు నిండుగా ప్రవహిస్తున్నది. బాబాసాగర్ అర్కగూడ ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ప్రాణహితకు భారీగా వరద వస్తుండడంతో గూడెం అంతర్రాష్ట్ర వంతెన వద్ద ప్రాణహిత ఉధృతంగా ప్రహిస్తున్నది. బ్యాక్ వాటర్‌తో గూడెం, దిందా, చిత్తామ, కోయపల్లి, దిందా గ్రామాల్లోని రైతుల పంట పొలాల్లోకి నీరు చేరింది. ప్రాణహిత ఉధృతికి కోటపల్లి మండలంలోని రైతులకు భారీ నష్టం వాటిల్లింది. పరీవాహక ప్రాంతాల్లో పంటలు నీటిలోనే ఉండిపోయాయి. పత్తి మొలక దశలో ఉండగా, పరిస్థితి ఏంటోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. వెంచంపల్లి నుంచి దేవులవాడ వర పరీవాహక గ్రామాల్లోని పంటలు నీట మునగగా, ఇప్పటికే వ్యవసాయ శాఖ అధికారులు సందర్శించారు. ప్రాథమికంగా నష్టాన్ని అంచనా వేశారు. వేమనపల్లి మండలంలో ప్రాణహిత ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శ్యామ్‌పటేల్ సూచించారు. సుంపుటం-వేమనపల్లి మధ్య లోలెవల్ వంతెనపై వరద ప్రవహిస్తుండడంతో దారి మూసివేశారు. జాజులపేట గ్రామానికి చెందిన గర్భిణి దన్నూరి భారతి వైద్యం కోసం చెన్నూర్ దవాఖానకు తన భర్త మహేశ్‌తో వెల్తుండగా, రోడ్డుపై నీరు భారీగా ప్రవహించడంతో 108 అంబులెన్స్ సిబ్బంది, నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్ వారిని సురక్షితంగా అంబులెన్స్‌లో ఎక్కించి పంపించారు. పెంచికల్‌పేట్ మండలంలోని పెద్దవాగు, ఉచ్చుమల్లివాగు, బొక్కివాగు ఉధృతంగా ప్రహిస్తున్నాయి. పరీవాహక ప్రాంత పంటలు నీట మునిగాయి. అంతర్గత రోడ్లు బురదమయంగా మారాయి. మేర గూడ గ్రామానికి కాలినడకన కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొన్నది. సింగరేణి ఓసీపీ(ఉపరితల) గనులపై వర్షం తీవ్ర ప్రభావం చూపుతున్నది. పెన్‌గంగ పరీవాహక మాకిడి, జక్కాపూర్, హుడ్కులీ, వెంకట్రావ్‌పేట్, పారిగాం, లోనవెల్లి, తదితర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిర్పూర్(టీ) ఎస్ఐ దీకొండ రమేశ్ సూచించారు. వెంకట్రావ్‌పేట్ అంతర్రాష్ట్ర వంతెనను పరిశీలించారు. మండలంలోని హుడ్కులీ సమీపంలో లిఫ్ట్ ఇరిగేషన్ ట్యాంక్‌పై పెన్‌గంగా బ్యాక్ వాటర్‌లో చిక్కుకున్న ఓ వృద్ధుడిని ఎస్ఐ దీకొండ రమేశ్ రక్షించారు. ట్యాంక్ సమీపంలో గోపాల్.. వలస వచ్చి తాత్కాలికంగా నివాసం ఉంటున్నాడు. పెన్‌గంగ ఉప్పొంగడంతో ట్యాంక్ పైకి ఎక్కాడు. అంతలోనే ట్యాంక్ చుట్టు నీరు చేరడంతో అక్కడే చిక్కుకున్నాడు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ అక్కడికి వెళ్లి, గోపాల్‌ను తాడుసాయంతో రక్షించారు. కెరమెరి మండలం సాంగ్వీ సమీపంలోని కల్వర్టు పైనుంచి ప్రవహిస్తున్న వరదనీటిని ఎస్ఐ విజయ్ జేసీబీ సాయంతో చెత్త తొలగించి, ప్రవాహాన్ని తగ్గించారు. రవాణా మార్గాన్ని మెరుగుపర్చారు. సింగరేణి వ్యాప్తంగా ఓసీపీల్లో ఉత్పత్తి, ప్రైవేట్ కాంట్రాక్టు సంస్థలకు అప్పగించిన మట్టి తవ్వకాలు, రవాణా పూర్తిగా నిలిచిపోయింది. 30 శాతం మాత్రమే బొగ్గు ఉత్పత్తి జరగుతున్నట్లు తెలుస్తున్నది. శ్రీరాంపూర్ ఓసీపీలో మెయింటనెన్స్ పనులు నిర్వహిస్తున్నారు. శ్రీరాంపూర్ ఓసీపీలో రోజుకు 9 వేల టన్నులు, ఇందారం ఓసీపీలో 3500 టన్నుల ఉత్పత్తికి ఆటంకం కలుగుతున్నది.

కెరమెరి : వరద నీటిని తొలగింపజేయిస్తున్న ఎస్ఐ విజయ్

పాఠశాలల్లో అధికారుల తనిఖీలు

చెన్నూర్, జూలై 25 : చెన్నూర్ పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల (బాలికల) పాఠశాలను గురువారం మండల ప్రత్యేకాధికారి, డీపీవో వెంకటేశ్వర్ సందర్శించారు. విద్యార్థుల వసతులు, సౌకర్యాలను పరిశీలించారు. వంటగది, డైనింగ్ హాల్, భోజనాన్ని, పాఠశాలలోఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లు, ఇతర రికార్డులను పరిశీలించారు. విద్యార్థినులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీవో మోహన్, ఎంపీవో అజ్మత్ అలీ పాల్గొన్నారు.

నస్పూర్, జూలై 25 : మంచిర్యాలలోని మోమిన్‌పురా ఎంపీయూపీఎస్ ఉర్దూ పాఠశాలను ఎంఈవో పోచయ్య, విద్యాశాఖ జిల్లా సెక్టోరియల్ అధికారి సత్యనారాయణ తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. మొత్తం విద్యార్థులకు, హాజరైన వారికి తేడా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారంలోగా వివరణ ఇవ్వాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. సమయ పాలన పాటించాలని, నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు.

కాసిపేట, జూలై 25 : కాసిపేట మండలం సోనాపూర్, నాయకపుగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో వాసాల ప్రభాకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోనాపూర్ పాఠశాలలో 30 మందికి 25.., నాయకపుగూడ పాఠశాలలో 22 మందికి 19 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల అభ్యాసనా సామర్థ్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జాసింత, జ్యోతి, సీసీవో రాంబాబు పాల్గొన్నారు.

చెన్నూర్ : గురుకుల పాఠశాలలో విద్యార్థుల భోజనాన్ని పరిశీలిస్తున్న డీపీవో

నాటిన ప్రతి మొక్కనూ రక్షించాలి

హాజీపూర్ : మొక్క నాటుతున్న ఎంపీడీవో మధుసూదన్, ఏపీవో

చెన్నూర్‌లో మున్సిపాల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు

హాజీపూర్, జూలై 25 : నాటిన ప్రతి మొక్కనూ రక్షించాలని ఎంపీడీవో మధుసూదన్ అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని చందనాపూర్, నంనూర్ ప్రభుత్వ పాఠశాలల్లో ఏపీవో మల్లయ్య, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెన్నూర్, జూలై 25 : చెన్నూర్ పట్టణంలోని 1, 2వ వార్డుల్లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ర్యాలీ తీశారు. అనంతరం వార్డుల్లో మొక్కలను నాటి, ఇంటికి పంపిణీ చేశారు. మున్సిపాల్ వైస్ చైర్మన్ నవాజొద్దీన్, కమిషనర్ గంగాధర్, కౌన్సిలర్లు పోగుల సతీశ్, కమ్మల శ్రీనివాస్, మున్సిపాలిటీ సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

దండేపల్లి, జూలై 25 : దండేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు పలురకాల మొక్కలు నాటారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మందమర్రి, జూలై 25 : మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో సదావేవా ఆర్గనైజేషన్ సభ్యులతో కలిసి అధ్యక్షుడు సంగి సంతోష్ ఇంటింటా మొక్కలను పంపిణీ చేశారు. పర్యావరణ రక్షణ అందరి బాధ్యత అని, అందరూ మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సభ్యుడు జనార్ధన్, పలువురు మహిళలు పాల్గొన్నారు.

రెబ్బెన, జూలై 25 : బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిటౌన్‌షిప్‌లో గల సింగరేణి ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో హెచ్ఎం సంతోష్, పీఈటీ భాస్కర్, స్నేహ కల్చరల్ ఆర్ట్స్ అండ్ సేవా సంస్థ అధ్యక్షుడు బూడిద గోపాలకృష్ణ మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి

హాజీపూర్ : రిజిస్టర్ పరిశీలిస్తున్న కల్పన

హాజీపూర్, జూలై 25 : కొత్తగా పట్టాపాస్‌పుస్తకం వచ్చిన రైతులు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మంచిర్యాల జిల్లా వ్యవసాయ అధికారి కల్పన సూచించారు. మండలంలోని గుడిపేట రైతు వేదికను గురువారం ఆమె సందర్శించారు. రైతు బీమా నమోదు, రైతుల రుణమాఫీ వివరాలను ఏఈవో శ్రీనిఖను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మా ట్లాడుతూ.. రైతులు ఆగస్టు 5వ తేదీలోగా దరఖాస్తు ఫారం, రైతు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో సంబంధిత ఏఈవో వద్దకు వెళ్లి, ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నా రు. మండల వ్యవసాయ అధికారి క్రీష్ణ ఉన్నారు.

సీసీసీ నస్పూర్/కెరమెరి, జూలై 25 : రైతులు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ అధికారులు కృష్ణ, ప్రభావతి ఒక ప్రకటనలో తెలిపారు. కెరమెరి మండలం ధనోరా రైతు వేదికలో ఏఈవో దరఖాస్తులను స్వీకరించారు. నస్పూర్‌లోని సీతారాంపల్లి రైతు వేదికలో దరఖాస్తు అందించాలని అధికారి సూచచించారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

కాసిపేట, జూలై 25 : శిక్ష సప్తాహ కార్యక్రమంలో భాగంగా కాసిపేట తెలంగాణ మోడల్ స్కూల్‌లో 4వ రోజూ సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు సాంప్రదాయ స్వదేశీ ఆటలు పోటీలు నిర్వహించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ అందె నాగ మల్లయ్య అభినందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాసిపేట : విద్యార్థులతో మోడల్ ప్రిన్సిపాల్ అందె నాగ మల్లయ్య

ఎక్సైజ్ అధికారుల దాడులు

జన్నారంలోని కిరాణాదుకాణంలో పట్టుబడిన బెల్లం, పటికను చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

జన్నారం, జూలై 25 : మండలంలోని కిరాణాదుకాణాల్లో ఎక్సైజ్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. పటిక, బెల్లం, నాటుసారా విక్రయించే ఏడుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ గంగారెడ్డి తెలిపారు. పొనకల్‌కు చెందిన బండారి లక్ష్మీనారాయణవద్ద 20 కిలోల బెల్లం, 25 కిలోల పటిక, చింతగూడకు చెందిన బదావత్ తుకారం వద్ద 100 కిలో బెల్లం, రేండ్లగేడకు చెందిన గురువయ్య వద్ద 2 లీటర్ల నాటుసారా, పొనకల్‌కు చెందిన గాజజుల స్వామి వద్ద 2 లీటర్ల నాటుసారా, పొనకల్‌కు చెందిన వట్టెం కిష్టయ్య వద్ద 6 లీటర్ల నాటుసారా, పొనకల్‌కు చెందిన ఆకుల శంకరయ్య వద్ద 6 లీటర్ల నాటుసారా, పొనకల్ నరేశ్ వద్ద 265 కిలోల బెల్లం, 5 కిలోల పటిక లభించినట్లు వెల్లడించారు. వారిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. దాడుల్లో జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ సమ్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

వివాదాస్పద భూమి సర్వే

కాసిపేట, జూలై 25 : కాసిపేట మండలం పెద్దనపల్లిలో సింగరేణి భూసేకరణలో భాగంగా గతం నుంచి వివాదంగా ఉన్న 27.7 ఎకరాల భూమిని తహసీల్దార్ భోజన్న ఆధ్వర్యంలో గురువారం సర్వే చేపట్టారు. తహసీల్దార్ భోజన్న, ఎంఆర్ఐ శ్వేత, సర్వేయర్ చారి వర్షంలోనే వాగు దాటి వెళ్లారు. వివాదస్పద భూ సమస్య పరిష్కరించడం, లబ్ధిదారులను నిర్ణయించేందుకు మోకాపై సర్వే నిర్వహించారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

చెన్నూర్ టౌన్, జూలై 25 : గ్రామంలో ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు నివారణ చర్యలు తీసుకోవాలని మంచిర్యాల డీపీవో, మండల ప్రత్యేకాధికారి డీ వెంకటేశ్వర్ రావు అధికారులను ఆదేశించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీల ప్రత్యేకాధికారులు, మండలస్థాయి అధికారులు, కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వన మహోత్సవంలో భాగంగా ప్రతి పంచాయతీలో వంద శాతం మొక్కల పంపిణీ, అవెన్యూ ప్లాంటేషన్‌కు అనుగుణంగా ఎత్తైన మొక్కను లొకేషన్ వారీగా అనువైన ప్రదేశంలో నాటేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఎం మోహన్, ఎంపీవో ఎండీ అజ్మత్ అలీ, ఉపాధి హామీ ఎంపీవో గంగాభవానీ, పంచాయతీల ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కాసిపేట, జూలై 25 : సోమగూడెం పాత బస్టీ బ్రిడ్జి సమీపంలోని కల్వర్టు వద్ద గురువారం స్కూటీ అదుపు తప్పి పడిపోవడంతో కాసిపేటకు చెందిన పెంజర్ల లక్ష్మణ్(32) అక్కడికక్కడే మృతి చెందాడని ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. గురువారం ఉదయం లక్ష్మణ్.. సోమగూడెం నుంచి కాసిపేటకు స్కూటీపై అతివేగంగా అజాగ్రత్తగా వెళ్తుండగా, అదుపుతప్పి కిందపడిపోయాడు. తలకు తీవ్ర గాయాలై, అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి పెంజర్ల బాపు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

హాజీపూర్, జూలై 25 : అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని పట్టుకున్నట్లు హాజీపూర్ ఎస్ఐ గోపతి సురేశ్ తెలిపారు. మండలంలోని గుడిపేట వద్ద వాహనాల తనిఖీలో భాగంగా అనుమతులు లేని ఓ ఇసుక లారీ పట్టుబడిందని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పాఠశాలల్లో శుభ్రత పాటించాలి

మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ అధికారిణి రమాదేవి

ఆసిఫాబాద్ టౌన్, జూలై 25 : జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో శుభ్రత, నాణ్యత పాటించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి రమాదేవి పేర్కొన్నారు. జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న కుక్ కామాటీలకు జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమానికి, ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆశ్రమ పాఠశాలల్లో నాల్గో తరగతి సిబ్బంది పాత్ర ఎంతో ముఖ్యమైందన్నారు. వంటశాలలో ఈగలు, దోమలు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలన్నారు. జిల్లాలోని అధికారులు సిబ్బంది సేవలు కొనియాడారు. ఏటీడీవోలు క్షేత్రయ్య, ఖమ్రుద్దీన్, బీసీడీవో శకుంతల, ఏసీఎంవో ఉద్ధవ్, జిల్లా గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి, ప్రధానోపాధ్యాయులు సుధాకర్, సనత్ కుమార్ శాస్త్రి, సిబ్బంది పాల్గొన్నారు.

స్వీట్ హౌస్ సీజ్

ఆసిఫాబాద్ టౌన్, జూలై 25 : గడువు తీరిన, పాడైపోయిన స్వీట్స్, తినుబండారాలు విక్రయిస్తున్న ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధి జన్కాపూర్‌లోని దేవీ స్వీట్ హౌస్‌ను గురువారం సీజ్ చేసినట్లు కమిషనర్ భుజంగరావు తెలిపారు. తనిఖీ చేపట్టగా, పూర్తిగా పాడైపోయి, బూజు పట్టిన స్వీట్స్, గడువు తీరిన చిప్స్, తినుబండారాలు అమ్ముతున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. సదరు షాపును సీజ్ చేస్తూ, రూ.6వేల జరిమానా విధించినట్లు తెలిపారు. తనిఖీల్లో సిబ్బంది సంతోష్ తదితరులు ఉన్నారు.

సాయినాథ్ లాడ్జిలో వ్యభిచార ముఠా అ